**2**



"ట్రైమెంతయ్యింది? తలవని తలంపుగా అడిగిందామె.

"పెళ్ళికింకా చాలా టైముందిలే ఛలోక్తిగా అంటూ చలాకీగా చూశాడామెను. ఆ చూపుల్లోని చురక విజయ గమనించి కూడా వూరుకుంది.

"కానీ ఇలా మనం మాట్లాడుతూ కూర్చుంటే ఆ టైము దగ్గరకావడమెంతసేపు" నీకేం తీసిపో నన్నట్లు సమాధానమిచ్చి బుంగ మూతి పెట్టింది. అడిగిందొకటయితే చెప్పిందొకటి కావడంతో అలుక వహిస్తూ.

"అంతలోనే అలుకా. ఆడవారికి అలకే అలంకారమంటారు నిజం సుమా?"

"కవిత్వానికేం గానీ ఇంక లేద్దామా?"

"ఏం బోరుగా వుందా?"

"అబ్బే అలాంటిదేం లేదు. మన గురించి వాళ్ళంతా వెతుక్కునే అవసరం రానీయ కూడదుగా."

"అఫ్‌కోర్స్ వాళ్ళకింకా మనం గుర్తున్నామంటావా?"

"సరేలే పిల్లి కళ్ళు మూసుకుని పాలు తాగుతూ, తన్నెవరూ చూళ్ళేదనుకుంటుందట. ప్రేమికులూ అంతే" నోరు జారినందుకు నాలిక్కరుచుకుంది.

"ప్రే....మి...కులు....అంటే మనం కూడా."

"ఏం ఎందుక్కాకూడదు?"

అనుకోని ఆ ప్రశ్నకు అదిరిపోయాడు విజయ్.

"అవును ఎందుక్కాకూడదు కావచ్చు కానీ, నిజంగా ప్రేమికులయిన వాళ్ళు ఇంతసేపిలా కబుర్లతో కాలం కాజేయరు ఇంకొంచెం ముందుకు ప్రొసీడవుతారు."

అతని మాటల్ని మధ్యలోనే కత్తిరించాలన్న వూహతో చనువుగా తన అరచేతిని అతని నోటికి అడ్డుపెడుతూ,

"స్టాప్ దేర్. అబ్బాయిగారి ఆశ తెలిసిందిగానీ, ఈ అమ్మాయిగారి దగ్గరలాంటి వేషాలేం కుదరవ్."

"అవేం కుదరవు...." అంటూ ఆమె చేతిని ఒక్క వుదుటున బలంగా తన వైపు లాక్కొని, కోమలమైన ఆమె అరచేతిపై....కోరిక తీరా.... ఓ ముద్దు పెట్టాడు చనువుగా ఆమె చెయ్యి పట్టుకుని పైకి లేస్తూ!

❋

"వెళ్ళిన పనేమైంది కాయా?... పండా?..."

వాలు కుర్చీలో కూర్చుని వారపత్రిక తిరగేస్తున్న వినాయకరావ్‌గారు మళ్ళీ ఈలోకంలోకి వచ్చారు భార్య వేసిన ప్రశ్నకు.

"కట్నం యిచ్చుకోలేని వాళ్ళకి కాయకాక పండెక్కడవుతుందీ" కర్మయోగిలా సమాధానమిచ్చారాయన సావధానంగా.

"అదేంటండీ....పిల్లాడేం పెద్ద చదువుకోలేన్నారుగా, పైగా ఏదో చిన్న ఉద్యోగమే చేస్తున్నాడటగా... మరి కట్నం యిచ్చుకోలేకపోవడమేమిటి?" ఆశ్చర్యంగా బుగ్గలు నొక్కుకుంటూ అడిగారావిడ.

"పిచ్చిదానా, మగాడయితే చాలే ఈకాలంలో

# స్వయంవరం

**— ఎం. భానుప్రియ**

వాడికి చదువూ చట్టు బండలూ ఏమీ లేకపోయినా, తన కడుపునే నింపుకోలేనంతటి చిన్న ఉద్యోగమయినా, పదిహేను వేలు రొక్కం పుట్ట మీద పెట్టినట్లు సమర్పించుకోవాల్సిందే.... కాలం అలా వుంది. మనమేం చేయగలం? ఇంతకీ దానియోగం ఎలా వుందో...''కాలం తీరును కాచి వడబోసినట్లు విడమర్చి చెప్పి గాఢంగా ఓ నిట్టూర్పు విడిచి....

''పద్మా!....'' అని కేక వేసారు.

''ఏం నాన్నా...'' పరుగెత్తుకుంటూ వచ్చింది పద్మ.

''చేతి సంచితే బజారుకెళ్ళొస్తాను'' అని అక్కడ్నుంచి నిష్క్రమించారు. ఇంకా వుంటే భార్య ఇంకేం ప్రశ్నలతో మెదడుకు మేత పెడ్తుందో నన్న భయంతో!....

❋

వినాయకరావుగారు రిటైర్డ్ సెకండ్రీగ్రేడ్ స్కూలు టీచరు కాక ముందు పాలకొల్లులో పాతికేళ్ళు సంసారం సాగించి రిటైరయ్యాక స్వంతవూరైన తణుకులో తండ్రి మిగిల్చిపోయిన ఓ ఇల్లు ముక్క ఓ చిన్న పొలం చెక్క చూసుకుంటూ కాలం వెళ్ళ మార్చుతున్నారు.

రిటైరుకాగానే విజయ్ చదువు నిమిత్తమై, మరికొన్ని లోగడ చేసిన అప్పులు తీర్చే నిమిత్తమై ఆ వున్న కాస్త పొలం చెక్కా అమ్మేయాల్సి వచ్చింది. పద్మ విజయ్‌కు అక్క. పాతికేళ్ళు పైబడుతున్నా ఇంకా అవివాహితగా మిగిలి వినాయకరావు గార్కి సమస్యల పుండులా తయారయ్యింది. ''పాపం పిచ్చిపిల్ల.... ఆడపిల్లనుగా చేసి ఆ సర్వాంతర్యామి దాని జీవితంతో అలా ఆట్లాడుకుంటూ వుంటే....'' అనుకుంటారు అప్పుడప్పు డాయన.

నిజానికి కట్నం యిచ్చుకోలేని, స్తోమత లేని తన చేతకాని తనమే తన పద్మను ఇన్నాళ్ళు ఇన్నేళ్ళు కుమారిగా కూర్చోబెట్టింది. ఇప్పటికి.... పది పన్నెండు సంబంధాలు వెతికి తెచ్చాడు తను. కానీ అన్నీ తన స్తోమతకు అందని, అందుబాటులో లేనివే! అందరికీ పద్మ నచ్చుతుంది.... ఎందుకు నచ్చదు మరి. కుసుమ సుకుమారంతో కుందనపు బొమ్మలా వుండే పద్మను 'బాగులేదు' అనడానికి ఎవరికైనా ఎన్ని గుండెలుండాలి?.... కానీ, చదువు పెద్దగాలేని సంపాదనలు కూడా తెచ్చుకోలేని 'పద్మ' లాంటి ఆడపిల్లలు – ఆంధ్ర దేశమనే ఆకాశంలో చుక్కల్లా ఎందరు లేరు?—

ఇంక 'విజయ్' డిగ్రీ పూర్తి చేసుకుని ఓ రెండేళ్ళు నిరుద్యోగ పర్వంలో గడిపి, నానా ప్రయాసలు పడి, ఏదో ఓ ప్రయివేటు కంపెనీలో రాజమండ్రిలో ఓ చిన్న ఉద్యోగస్తుడయ్యాడంటే.

వాడి జీతం వాడికే చాలదు. ఇదిలా వుండగా వాడింక, తనకి గానీ, పద్మ పెళ్ళికి గానీ ఆర్థిక సహాయం ఎలా అందించగలడు? అసలడగడానికి తనకెలా ముఖం చెల్లుతుంది?

నిరంతర జీవన వాహినిలో నిత్యం నిప్పులాంటి నిర్వేదాన్ని నిగ్రహంగా మోస్తున్న వినాయకరావు లాంటి మధ్య తరగతి ప్రాణులెంత మంది లేరీ సువిశాల దేశంలో? వాళ్ళకు సమస్యలే తప్ప సమాధానాలు తెలియవు. ఆవేదనలే తప్ప - ఆశయాలుండవు. గోదారి ప్రవాహానికి కొట్టుకుపోయే గడ్డిపోచలు తమ ఇష్టం వచ్చినట్లు ప్రయాణించలేవు. కాలప్రవాహానికి కొట్టుకుపోయే ఈ మధ్య తరగతి జీవితాలూ అంతే! ఇబ్బందులే తప్ప ఇష్టాలు లేని వింత జీవితాలివి.

❋

''వండ్రఫుల్.... అక్కా.... మార్వలస్, ఎంత బాగా రాశావని...'' ఆ పత్రికలో వినయ రాసిన ''కట్నం-కానుక'' అనే ఆర్టికల్‌ని చదువుతూ కుర్చీలోంచి ఎగిరి గంతేసినంత పన్జేసింది వినయ.

ఎదురు కుర్చీలో కూర్చుని ఏదో ఆర్టికల్ రాసుకుంటున్న వినయ మాత్రం పెద్దగా సంతోషించలేదు విజయ కామెంట్‌కి. 'థాంక్యూ' అని సింపుల్‌గా అనేసి చిర్నవ్వు నవ్వొకటి నవ్వి వూరుకుంది కామ్‌గా.

''రియల్లీ సూపర్బ్ అక్కా...అబ్బా ఈ పేరాలో ఎంత ఎక్స్‌ప్రెషనుంది చూడు....'' అంటూ వుండబట్టలేక బయటకు బిగ్గరగా చదవసాగింది.

''లంచం పుచ్చుకునే వాడికంటే యిచ్చుకునే వాడే ఎక్కువ పాపం, నేరం చేస్తున్నట్లు. అదే ఈ కట్న-కానుకల విషయంలో కూడా వర్తిస్తుంది. ఎందుకంటే, 'కట్నం' ఘనంగా చెల్లించుకోకపోతేనేగానీ తమ పిల్లలకు మంచి భర్తలు దొరకరు అన్న భయం చేతగానీ, 'కట్నం' ఎంత ఎక్కువ ఈయగలిగితే తమ హోదా అంతస్తు ఎదుగుతాయన్న గొప్పవలన గానీ ఈ కాలం ఆడపిల్లల తల్లి-దండ్రులు పెద్ద పరుగులకుపోతే ఆనేరం.... ఆనేరం వారిది కాదా? పెళ్ళి అవసరం ఒక్క ఆడపిల్లకైనా (మన ప్రస్తుత వివాహవ్యవస్థలో నూటికి నూరుమంది అనుకుంటున్నట్లు) మగాడు మాత్రం ఎన్నాళ్ళు పెళ్ళిలేకుండా వుండగలడు? పోనీ, పెళ్ళి వయసుకెదిగిన మగపిల్లాడిని ఎన్నాళ్ళని పెళ్ళి చేయకుండా వుంచుకోగల్రు?''చదవడం పూర్తిచేసి,

''నీ వాఖ్యానానికి నీ అభిప్రాయాలకి హండ్రడ్ థాంక్స్, ఇలా ప్రతి ఒక్కరూ, మగపెళ్ళి వారిని నిలదీసి, నిగ్గదీసి అడగ్గలిగితే మనలాంటి మధ్య తరగతి ఆడపిల్లలకు పెళ్ళి ఒక సమస్యే కాదు?

''అన్నీ బావున్నాయ్ కానీ, ఓ చిన్న డవుటక్కా. ఇంత వివరంగా, విపులంగా పత్రికల్లో వ్రాసి - ప్రజల్లోనూ, ముఖ్యంగా నాలాంటి ఆడపిల్లల్లో చైతన్యం కల్గించిన దానివి. నీ విషయంలో నువ్వెందుకలా నెలకో మారు పెళ్ళి

చూపుల పేరుతో ఏర్పాటు చేయబడుతున్న శల్య పరీక్షకు సంసిద్ధ మవుతున్నావ్?''

''ఎందుకా? అది నాచేతిరాత, ఎలా నచ్చితే అలా రాయగల్ను కానీ ఇది నా నొసటి రాత. దీని ఇష్టా-ఇష్టాలు మనమెలా నిర్ణయించగలం?...''

''నువ్వొతి పిరికిదానివక్కా. నీకు రానే ధైర్యమే కానీ, అడిగే ధైర్యం లేదు...''

''నీదాకా వచ్చే వరకూ నిజా నిజాలు నీకంత సులువుగా తెలియవ్? కానీ ఒక్కటి మాత్రం నిజం విజయా, ప్రతీ ఆడపిల్లా ''డబ్బు పెట్టి కొనుక్కునే భర్త నాకువద్దు'' అని కచ్చితంగా చెప్పగలిగి, ఆ మాటమీదే ఆఖరి వరకూ నిలబడిన నాడు ఈ సమస్య చాలా వరకూ పరిష్కార మైనట్టే. కానీ అంత గుండెధైర్యం అటు ఆడపిల్లకూ, ఇటు ఆ పిల్లను కన్న తల్లి—దండ్రులకూ ఇద్దరికి వుండడం లేదు. కనీసం—ఆడపిల్లకు తన ఇష్టం ఇదీ అని చెప్పుకోగలిగే స్వేచ్ఛా-స్వాతంత్ర్యం కూడా లేకపోయింది ఈ వ్యవస్థలో.'' ఉద్వేగంగా అంది వినయ. తూచి మాట్లాడం ఆమెకు వెన్నతో పెట్టిన విద్య. మాట్లాడే ముందు గంభీరంగా ఆలోచించి, ఆ గంభీరమైన ఆలోచనకు గమ్మత్తైన భాష జతచేసి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తుంది. కానీ ప్రయోజనం ఏమిటి? 'వినయ' కూడా ఈ దేశంలో చాలామంది ఆడవాళ్ళలాగానే పిరికిది. అఫ్‌కోర్స్ దానికో అందమైన ముసుగును తొడిగి అందంగా 'అణకువ' అంటున్నారు లెండి.

ఆ అణకువతోనే ఇప్పటికి ఆరుసార్లు పెళ్ళిచూపుల పరీక్షకు హాజరయ్యింది. అందరూ 'వినయ' వినయ విధేయతల్ని ముక్తకంఠంగా కొనియాడి, అంద చందాల్ని అందలం ఎక్కించి, ''అక్కడకు వెళ్ళి ఉత్తరం రాస్తాం లెండి.'' అని చెప్పి వెళ్ళిపోయిన వాళ్ళే.

అక్కడకు వెళ్ళాక వాళ్ళు రాసేది ఉత్తరం కాదు. కోర్కెల శర పరంపర.

''కరెక్ట్‌గా చెప్పావు అక్కా. ఈ దేశంలో చాలా మంది మధ్యతరగతి ఆడపిల్లలకున్న బలహీనతే అది. ''పెళ్ళికూతురు నచ్చిందా బాబూ.'' అని అడిగిన పెద్దవాళ్ళు 'పెళ్ళికొడుకెలా వున్నాడు'? అని మాట వరసకైనా ఆమ్మాయిని అక్కడే అడగరు. అథవా, అడిగిన దానికి సమాధానంగా ఆ అమ్మాయి తన సొంతభిప్రాయం చెప్పకూడదు. చెప్పినా, ఆ నిజాన్ని బయటకు పొక్కనీయకుండా జాగ్రత్త పడతారు ఆమెను కన్న తల్లి దండ్రులు. ఎందుకో తెలుసా. అలా చేస్తే ''పిల్ల పొగరుబోతు-వదరబోతూ.'' అన్న వదంతి ఎక్కడ లోక వ్యాప్తమైపోతుందో నన్న భయం. డబ్బు పెట్టి కొనుక్కునే వాళ్ళం మనం అయినప్పుడు, మనం వాళ్ళకు నచ్చేదేమిటి. నాన్సెన్స్. వస్తునాణ్యత వినియోగదార్లం, విక్రయం చేసేవారి దగ్గర్నుంచి కొనుక్కునే వాళ్ళం మనం నిర్ణయించాలి గానీ.'' ఉద్వేగంగా చెప్పుకుపోతున్న చెల్లి మాటలకు ఆనకట్ట వేస్తూ.

**కవి**

అందరికి మామూలుగా కనిపించేదాంట్లో
అతనికేదో వింతసొగసు కనిపిస్తుంది!

*

**ప్రేమించడమంటే?**

నా మనసుకు తెలిసిన భాష
నీ మనసు నేర్చుకోవడమే!

*

**ప్రేమంటే?**

రెండు హృదయాలు
ఒకే భాష నేర్చుకోవడం!

—'భవాని'

''ఈ తగువు అనాదిగా వస్తున్నదే. అందరూ అంటున్నదే, వింటున్నదే. ఈ ఒక్కరోజుతో మనిద్దరి వల్లా తేలేది, తెమిలేది కాదు గానీ, బుద్ధిగా లైటార్పి పడుకో. టైం పదకొండయినట్లుంది.'' అంటూ ఆవలించింది వినయ. మంచం మీద దుప్పట్లూ-అవి తీసి దులిపి పక్క సరిచేసే ప్రయత్నాన్ని కుపక్రమిస్తూ.

''అక్కా, నాకు మటుకు. నువ్వు చెప్పినట్లుగానే డబ్బు పెట్టి కొనుక్కునే భర్త అసలు వద్దే వద్దు. ఎవరెన్ని చెప్పినా ఎన్ని అడ్డంకులొచ్చినా సరే నా ఈ నిర్ణయం మారదు. మార్చుకోను. ఆ తరహా భర్త లభించే వరకూ, అది ఎన్నాళ్ళయినా ఎన్నేళ్ళయినా ఈ నా 'స్వయంవరం' కొనసాగిస్తునే వుంటాను.'' విజయ చెప్పింది నిర్భయంగా. ఆమె మాటల్లో వ్యక్తమైన నిర్భయానికి 'వినయ' ఆశ్చర్యపోయింది.

''సరే ఆలోచిద్దాంలే'' అని యధాలాపంగా అనేసి లైటార్పేసింది వినయ. వినయ పడుకున్న మేరకు గదినిండా చీకటి-విజయ పడుకున్న మేర గదినిండా వెలుగు చిత్రంగా వారి, వారి వ్యక్తిగత జీవితాల్ని సూచిస్తున్నట్లుగా వుందా దృశ్యం.

❋

ఆరోజు ఆదివారం కావటమ్మూలాన గోదావరి గట్టుపై సాయంకాలపు చల్లగాలుల కోసం వచ్చిన వారి సంఖ్య కాస్త ఎక్కుగానే వుంది.

చల్లగాలి మాటెలా వున్నా మునిమాపు సంధ్యా సమయం వసుపురంగు పట్టు చీర కట్టుకుంటున్న ఆకాశం ఆ పట్టుచీర మీద మెరుస్తున్న వెండి జరీలా మబ్బు చాటుల్లోంచి పొడుచుకువచ్చే సూర్యుని వెలుగు. ఆ కొద్దిపాటి వెలుగయినా 'నేనెందుకు వూరుకోవాలి?' అన్నట్లు గోదావరి ఉపరి తలంపై పడి నీరు సువర్ణమయం కావడం. అనంత కాల వాహినిలా నిరంతరం ప్రవహించే గోదావరి, ఆ సుందర ప్రకృతి దృశ్యం చూస్తున్న వారి కెవ్వరికైనా మానసోల్లాసం కలుగక మానదు.

''ఏమిటి చూస్తున్నావ్?'' అడిగాడు విజయ్. ప్రకృతిలోని మౌనాన్ని భరించగలిగినా, తమ ఇద్దరి మధ్యా పేరుకుపోయిన మౌనాన్ని అంగీకరించ లేనట్లు.

''రోజూ చూసే ప్రకృతే అయినా, రోజుకో రూపు సంతరించుకుంటున్న దీని అందం వింతల్లో వింత కాదూ.''

''ఈ మధ్య కథలు రాస్తున్నావా?'' జోక్ చేసినట్లన్నాడు.

''కథ కాదు. విజయ్ నిజం. అలా చూడొకసారి. ఆ అనంత తీరం వైపుకు. నింగి వంగి నేలను ముద్దాడుతున్నట్లు లేదూ. నింగీ-నేల ఎంతో దూరంలో వున్నా వాటి మధ్య అనునిత్యం పెనవేసుకు పోయే ఆ అనురాగ సంగమం చూడ ముచ్చటగా వుంటుంది కదూ.

''అవును గానీ. ఏంటి అమ్మాయిగారి దృష్టి ముద్దు మీదకూ, అనురాగ సంగమం మీదకూ మళ్ళింది. అనుమతిస్తే ఆపాటి నేను చేయలేనా ఏమిటి?'' నవ్వుతూ అన్నాడు.

"సంతోషించాం గానీ, మగాడు కట్నం పుచ్చుకోవడంపై నీ అభిప్రాయం ఏమిటి?" గతరాత్రి నుంచి తన మనసులో మథన పడుతున్న అంశాన్ని ఇంక మనసులో ఇముడ్చుకో లేక అడిగేసింది విజయ.

"ఏం ఇంటర్వ్యూ చేస్తున్నావా?"

"చెయ్యకూడదా?"

"చేయకూడదనెవరన్నారు? అభిప్రాయం తెలుసుకుందికే అయితే నిశ్చయంగా చేయవచ్చు."

"అభిప్రాయం కాదు. నేనడుగుతున్నది ఆచరణ."

"ఆఫ్‌కోర్స్. మాటల్లో వ్యత్యాసం చాలా వుందనుకో. నా మటుకు నాకు, 'మగాడు' తనకు నచ్చని, తనను మెచ్చని ఓ పిల్లని పదిమంది పెద్దలముందు 'పెళ్ళి చూపుల' పేరున కేవలం శారీరక శల్య పరీక్షలో చూసి – ఆమె అంతరంగం ఏమిటో తెలియక, ఆమె మానసిక పరిపక్వత ఏమిటో అర్థం చేసుకోకుండా కేవలం పెద్దలు మాట్లాడుకునే బేర–సారాల వ్యాపార ధోరణిలో వివాహం చేసుకుని సుఖపడలేడు. ఆ విధానంలో స్త్రీ–పురుషులిద్దరికీ స్వేచ్ఛ స్వాతంత్ర్యం లేదు. వుండదు."

"ఎగ్జాక్ట్‌లీ విజయ్. నీ అభిప్రాయం నూటికి నూరుపాళ్ళు నిజం. మనసులు కలవని మనుషుల్ని 'మన'తో ముడిపెడ్దామనుకునే ఈ మవుఢ్యం ఎప్పుడు తొలగిపోతుందో, అప్పుడే మన వైవాహిక జీవితాలు వెన్నెల పండుగ జరుపుకుంటాయి. అంతవరకూ ఎన్ని పున్నములొచ్చినా, అమావాస్య రేయితోనే సమానం,

"అబ్బో. ఏమో అనుకున్నా, నువ్వు నవల వ్రాయవచ్చు."

"జీవితాన్ని కథతో పోల్చకు విజయ్, నా ఉద్దేశంలో కథ వేరూ–జీవితం వేరూ కాదు. జీవితం కథ కావచ్చు. కానీ కథలా జీవితం ఎన్నడూ ముగియకూడదు" ఆమె సీరియస్‌గానే అందా మాటలు.

వెలుగును వెంట తరుముతూ చీకటి రాజ్యం చుట్టూ ముడుతోంది. ఇందాకటి సుందరమైన ప్రకృతి దృశ్యం భయంకరంగా భయపెడ్తున్నట్లుంది. మూసేస్తున్న మబ్బులు చీకటి ముద్దల్లా దట్టంగా వ్యాపిస్తున్నాయి.

"ఇంక లేద్దామా" అన్నాడు విజయ్, ఆమెలోని సీరియస్‌నెస్ భరించలేక.

"వూ...." అంటూనే అన్యమనస్కంగా లేచింది.

అలా ఆ గట్టు మీద సాయంత్రాలు వారిద్దరూ కలుసుకోవడమనే దినచర్య సుమారు ఆరునెలల క్రితం నుంచి జరుగుతోంది. స్నేహితుల పెళ్ళిళ్ళకని వెళ్ళి చిత్రంగా పరిచయమయి విచిత్రమైన ప్రేమలో పడి ఒకరి నొకరు తమ తమ వ్యక్తిగతాభిప్రాయాలు ఏకం చేస్కుంటూ జీవితం దారుల వెంట కలిసికట్టుగా ప్రయాణం చేద్దామనుకుంటున్న వారి ప్రణయం ఇంకా పెళ్ళి మాటల వరకూ రాలేదు.

❋

విజయ్ రూమ్ చేరేసరికి రాత్రి ఎనిమిదిన్నరయ్యింది. వీధిదీపాలు కూడా పోయి వీధి మొత్తం చీకటి చిద్విలాసంగా రాజ్యమేలుతోంది. చిన్నగా వానజల్లు.... చీదరగా ఈదురుగాలి.

అకాలంలో పట్టుకున్న వర్షం ముసురు.... మనసు ఎంత ఉల్లాసంగా ఉన్నా చీకాకును కలుగ చేస్తాయి. ఇప్పుడు విజయ్‌లోనూ అదే పరిస్థితి.

సైకిలు వీధి వరండాలో పెట్టి తాళం తీస్తూ వుంటే...."ఆయనొచ్చినట్లున్నారే...."

పక్కింట్లోంచి విన్పడ్డాయి ఆ మాటలు.

మాటల నానుకునే 'మంజుల' వచ్చించింది. చేతిలో ఏదో కాగితం వుంది.

"మామయ్యగారండీ, మీకేదో టెలిగ్రాం వచ్చింది." అని అందజేసింది చేతిలోని కాగితాన్ని, మళ్ళీ వెంటనే తుర్రుమంది ఇంట్లోకి.

టెలిగ్రాం, అనగానే మాన్పడిపోయారు విజయ్. ఎక్కడ్నుంచి. ఫ్రమ్ ఎడ్రస్ చూసి మరీ అదిరిపోయాడు. తణుకునుంచి. మనసు పరి పరి విధాలయిన ఆలోచనల్తో ముసురుకుంటుండగా, కంగారుగా విప్పి చదివాడు టెలిగ్రామ్‌ని.

"URGENT..START IMMEDIATELY..."
—VINAYAKARAO

ఆలోచించే వ్యవధి కూడా లేక, అసలు అతని ఆలోచన ఎటూ పాలుపోక, వున్నపళంగా బ్యాగ్ సర్దేసుకుని బయల్దేరిపోయాడు బస్సుస్టాండుకి ఏదో ఒక బస్సు దొరుకుతుందనే నమ్మకంతో!

[సశేషం]

## విశాఖ సిస్టర్స్

విశాఖ నగర పాలక సంఘాధ్యక్షుడు మేయర్ శ్రీ ఎన్. ఎస్. ఎన్. రెడ్డిచే 'విశాఖ సిస్టర్స్'గా నామకరణం చేయబడిన, తొమ్మిది, పది సంవత్సరాల ప్రాయంగల చిన్నారి నాట్య సోదరీమణులు శ్రీదేవి, మాధవి. స్థానిక నృత్య శిక్షకురాలు శ్రీమతి ఆకొండి రామకృష్ణ శిక్షణలో కూచిపూడి, భరతనాట్య నృత్య రీతులను నేర్చుకొని, గత మూడు సంవత్సరాలుగా యిప్పటికి 35 ప్రదర్శనలను యిచ్చి పలువురు పెద్దల ప్రశంసలను అందుకున్నారు. సాంప్రదాయ శాస్త్రీయ రీతులలోని నృత్యాలనే కాక, ఆధునిక జానపద నృత్యాలను సైతం అతి సునాయాసంగా, సహజంగా ప్రదర్శించడం ఆ చిన్నారుల మరొక ప్రత్యేకత! లయన్స్ క్లబ్ విశాఖపట్నం ఇండస్ట్రియల్ నిర్వహిస్తున్న సంక్షేమ కార్యక్రమాల నిమిత్తం, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఇంటర్నేషనల్ ఆక్యుపంక్చర్ అసోసియేషన్ మొదలైన సంస్థలు నిర్వహించిన సభా కార్యక్రమాలలోను, అనేక ఉత్సవ కార్యక్రమాలలోను విరివిగా ప్రదర్శనలిచ్చి పలువురి ప్రశంసలతో పాటు అనేక బహుమతులను కూడా పొందారు. వీరి ప్రదర్శనలు యింత వరకూ స్థానికంగానే కాక, అనకాపల్లి, కాకినాడ మొదలైన పరిసర పట్టణాలలో కూడా జరిగాయి. చిరంజీవు లిద్దరూ సెంట్ జోసెఫ్ స్కూలులో ప్రస్తుతం అయిదు, ఆరు తరగతులు చదువుతూ తమ విద్యావ్యాసంగంలో కూడా ప్రథములుగానే వుంటున్నారు.



—విశాఖ విలేకరి